సాక్షి
రాజన్న సిరిసిల్ల
బుధవారం ॥ 17 ॥ మే ॥ 2023



ఆడిట్ పూర్తి చేయాలి

సిరిసిల్ల: జిల్లాలో ఆడిట్ అభ్యంతరాలను నెలరోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లా ఆడిట్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు.



లెక్కలపై లుక్కేయాల్సిందే..!

ఇటీవల ప్రభుత్వం విడుదల చేసి న పదో తరగతి ఫలితాల్లో గణితంలోనే విద్యార్థులు ఎక్కువ మంది ఫెయిల్ అయ్యారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
43.0/26.0

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉదయం నుంచే ఎండవేడిమి ఎక్కువవుతుంది. వడగాలులు కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

ఘనంగా రేణుకామాత కల్యాణం



బోనాలతో ఊరేగింపు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మంత్రి కేటీఆర్ దత్తత గ్రామమైన మండలంలోని రాజన్నపేటలో రేణుక, జమదగ్ని కల్యాణ వేడుకలు మంగళవారం కనులపండువగా నిర్వహించారు. ఉదయం ఎల్లమ్మ, పోచమ్మ అమ్మవారి బోనాలు చేశారు. మహిళలు అమ్మవార్లకు ఒడిబియ్యం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఎల్లమ్మ సిద్ధోగ వేడుకలు కల్యాణంతో ముగిశాయి. వేడుకల్లో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, ఎంపీపీ పిల్లి రేణుక, జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, సింగిల్‌విండో చైర్మన్ కృష్ణారెడ్డి, మంత్రి కేటీఆర్ పీఏలు కుంబాల మహేందర్‌రెడ్డి, ధన్‌రాజ్, మండల సర్పంచుల ఫోరం కన్వీనర్ కొండాపురం బాల్‌రెడ్డి, నాయకులు నమిలికొండ శ్రీనివాస్, కొండ రమేశ్, నర్సింలు, గౌడ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సాహిత్యంతో సమాజ చైతన్యం



మురళిని సన్మానిస్తున్న సంఘం సభ్యులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): సాహిత్యం సమాజాన్ని చైతన్యపరుస్తుందని, ఎందరో రచయితలు తమ రచనల ద్వారా సమాజాన్ని ముందుకు నడిపిస్తున్నారని తెలంగాణ వివేక రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాసరవేని పర్శరాములు అన్నారు. మండలకేంద్రంలో సంఘం ఆధ్వర్యంలో తిమ్మాపూర్‌కు చెందిన ఆంగ్ల రచయిత కొండ మురళిని మంగళవారం సన్మానించారు. మురళి గ్రామీణ ప్రాంతానికి చెందిన వారైనా.. మాతృభాష తెలుగు అయినా ఆంగ్లంలో పట్టు సాధించారన్నారు. ఆంగ్లంలో రియల్ డ్రీమ్స్, ది పీస్ ఆఫ్ లైఫ్, ది రాచర్ల పోర్ట్, బిట్టర్ స్వీట్ జ్యూసెస్ వంటి 18 పుస్తకాలను రచించడం గర్వకారణమన్నారు. జిల్లా కార్యదర్శి దుంపెన రమేశ్, సభ్యులు అజయ్, దస్తగిరి, రాజు తదితరులు పాల్గొన్నారు.

యువతకు క్విజ్ పోటీలు

సిరిసిల్లటౌన్: యువశక్తిని మేల్కొలిపే దిశగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ తెలిపారు. యువతలో మేధో సామర్థ్యాన్ని గుర్తించి ప్రోత్సాహించడం, జనరల్ నాలెడ్జి పెంచడం, సాంప్రదాయక విద్యపై దృష్టి సారించేలా చేయడం దీని ముఖ్య ఉద్దేశమన్నారు. వివిధ దశల్లో జరిగే పోటీల్లో గెలిచిన వారికి ప్రథమ ల్యాప్‌టాప్, ద్వితీయ స్మార్ట్‌ఫోన్, తృతీయ ట్యాబ్‌లెట్, నియోజకవర్గాలకు ప్రోత్సాహంగా పది స్మార్ట్ హ్యాండ్ వాచ్‌లు, పది పవరల్ బ్యాంకులు, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి టాపర్లకు ఎలక్ట్రిక్ స్కూటీ అందిస్తామని, దీనిని యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 76618 99899 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

వసతుల కల్పనే లక్ష్యం: డీఈవో



వసతులను పరిశీలిస్తున్న డీఈవో రమేశ్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలనే లక్ష్యంతో మనఊరు–మనబడి కార్యక్రమం ద్వారా వసతులు కల్పిస్తున్నట్లు డీఈవో రమేశ్ తెలిపారు. మండలంలోని వెంకటాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న 40 రోజుల స్పోకెన్ ఇంగ్లిష్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ప్రైవేట్‌కు దీటుగా సర్కార్ బడులను తీర్చిదిద్దుతున్నామని, ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన చేస్తున్నామని వెల్లడించారు. అనేక పాఠశాలలు వందశాతం ఉత్తీర్ణత సాధించాయన్నారు. స్పోకెన్ ఇంగ్లిష్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన ఎస్‌ఎంసీ కమిటీ, గ్రామస్తుల కృషిని అభినందించారు. హెచ్‌ఎం శేఖర్, ఉపాధ్యాయులు శంకరమ్మ, రవీందర్ పాల్గొన్నారు.

కలప పట్టివేత

వేములవాడరూరల్: మండలంలోని మల్లారం ప్రభుత్వ స్థలంలో ఉన్న చెట్లను నరికి అక్రమంగా తరలిస్తుండగా మంగళవారం రెవెన్యూ, ఫారెస్టు అధికారులు పట్టుకున్నారు. దేవతల చెరువులో చాలా ఏళ్లుగా ఉన్న వేప చెట్లను కొంత మంది వ్యాపారులు నరికివేస్తూ తరలిస్తున్నట్లు గ్రామస్తులు అంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న రెండు శాఖల అధికారులు అక్రమ కలప తరలిపోతుండగా పట్టుకుని ఫారెస్టు అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

పైసల్ పడ్తలేవు!

- వారం కిందనే ధాన్యం విక్రయించిన రైతులు
- ఇంతవరకు ఖాతాల్లో జమకాని యాసంగి డబ్బులు
- డబ్బుల కోసం అన్నదాతల ఎదురుచూపులు
- కొనుగోళ్లు చివరిదశకు వచ్చినా..మారని పరిస్థితి



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఆరుగాలం కష్టపడి కష్టనష్టాలకు ఓర్చి, వడగండ్లు, కడగండ్లను దాటుకుని కొనుగోలుకేంద్రాలకు చేర్చిన ధాన్యం అకాల వర్షానికి కొట్టుకుపోగా మిగిలిన పంటను రైతులు అమ్ముకున్నారు. విక్రయించి వారం దాటినా.. ఇంతవరకూ నయాపైసా జమకాకపోవడంపై అన్నదాత ఆవేదన చెందుతున్నాడు. వేసవికాలం పంట కొనుగోళ్లు చివరిదశకు వచ్చినా.. ఇంకా డబ్బులు రైతుల ఖాతాలో పడకపోయేసరికి రైతు కుటుంబాలు దిగులు చెందుతున్నాయి.

తగ్గిన దిగుబడి

ఉమ్మడి కరీంనగర్ జిల్లావ్యాప్తంగా రైతులంతా వరిసాగుకే మొగ్గుచూపుతారు. ఈసారి మార్చిలోనే ఈదురుగాలులు వడగండ్లతో వాణిజ్యపంటలు నేలమట్టమయ్యాయి. చాలాచోట్ల వరిపంట కూడా దెబ్బతింది. కానీ, ప్రకృతి కోపానికి ఎదురొడ్డి నిలిచి, వాతావరణ ప్రతికూలతలు తట్టుకుని నిలబడినా వరికోత సమయానికి అకాలవర్షాలు, వడగండ్లు వరుసగా దాడి చేశాయి. పంట దిగుబడి చాలా తగ్గింది. కరీంనగర్‌లో 2.71 లక్షలు, పెద్దపల్లిలో 2.00 లక్షలు, జగిత్యాలలో 2.97 లక్షలు, సిరిసిల్లలో 1.71 లక్షల ఎకరాల చొప్పున పంట వేశారు. ఇందులో కరీంనగర్‌లో దాదాపు 56,066, సుమారు జగిత్యాలలో 65,794, సిరిసిల్లలో సుమారు 18,230 ఎకరాలు, పెద్దపల్లిలో దాదాపు 36,596 ఎకరాల మేర పంట నష్టం జరిగిందని వ్యవసాయ అధికారులు సర్వే ద్వారా నిర్ధారించారు. ఈ గణాంకాల్లో స్వల్ప వ్యత్యాసాలు కూడా ఉండొచ్చు.

వారంరోజులు దాటినా.. అందని డబ్బులు..

ఈ నేపథ్యంలో ప్రభుత్వం అన్నదాతలకు అండగా నిలిచింది. నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10వేల చొప్పున పరిహారం ప్రకటించింది. వెంటనే కొనుగోళ్ల కేంద్రాలు ప్రారంభించింది. ఎంతో కష్టపడి చివరికి అన్నదాతలు తాము పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించారు. అక్కడా మళ్లీ గాలులు, వడగండ్లతో ప్రకృతి పగబట్టిందా? అన్న స్థాయిలో వరుణదేవుడు విరుచుకుపడ్డాడు. వర్షపునీటికి కొట్టుకుపోగా మిగిలిన ధాన్యాన్ని ఎట్టకేలకు విక్రయించారు. విక్రయించే సమయంలోనూ తాలు, గడ్డి, మట్టిబెడ్డలు, తేమ శాతం పేరు చెప్పి క్వింటాలుకు 9 నుంచి 11 కిలోల వరకు తరుగు పేరిట రైతులను కొనుగోలు కేంద్రాలు, మిల్లర్లు కుమ్మక్కై దోపిడీ చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ధాన్యాన్ని విక్రయించిన చాలా మంది రైతులు వారం గడిచినా డబ్బులు ఖాతాలో జమ కాకపోవడంతో తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాము వడ్డీలకు అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టామని వీలైనంత త్వరగా ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని రైతులు కోరుతున్నారు.

తేదీ 15-05-2023 వరకు ఉమ్మడి జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు (మెట్రిక్ టన్నుల్లో)

జిల్లా	సేకరించిన ధాన్యం	మిల్లులకు తరలించింది	మిగిలింది
కరీంనగర్	1,36,064.496	1,34,948.957	1,115.539
జగిత్యాల	1,59,627.092	1,39,929.690	19,697.402
పెద్దపల్లి	1,00,763.720	97,667.340	3,096.380
రాజన్నసిరిసిల్ల	92,948.940	85,073.420	7,875.520
మొత్తం	4,89,404.248	4,57,619.407	31,784.841

డబ్బులు పడలేదు..



నేను ఈ నెల 4వ తేదీన ధాన్యం కాంట వేశారు. 9వ తేదీన రిసిప్ట్ కూడా ఇచ్చారు. ఇప్పటి వరకు నా ఖాతాలో డబ్బులు జమ కాలేదు. సెంటర్ నిర్వాహకులు రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వెంటనే డబ్బులు జమ చేయాలి. – పాకాల అనిల్‌రెడ్డి, జగ్గయ్యపల్లి, మానకొండూరు

వారం రోజులు అవుతోంది



ఈ సీజన్‌లో 90 క్వింటాళ్ల వరి ధాన్యం పండింది. కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం విక్రయించి వారం రోజులు అయ్యింది. లారీలో ధాన్యం తరలించారు. ఇప్పటికి నాకు డబ్బులు రాలేదు.– ఆకుల పెద్ద గంగారెడ్డి, కథలాపూర్

పది రోజులైంది



నాలుగు ఎకరాలలో ఈ యాసంగిలో వరి పంట వేసిన. నాలుగు ఎకరాలలో 230బస్తాల (40కిలోల సంచి)దిగుబడి వచ్చింది. పది రోజుల క్రితం ధాన్యంను కొనుగోలు కేంద్రంలో అమ్ముకున్న. క్వింటాలకు 4.60 కిలోల తరుగు పేరుతో కటింగ్ పెట్టారు. ఇన్నిరోజులవుతున్నా పైసలు పడలేదు.

– మారం తిరుపతిరెడ్డి, రైతు, హిమ్మత్‌నగర్, వీణవంక

నిర్లక్ష్యంతోనే ఆలస్యం



గతంలో పది రోజులో డబ్బులు జమ అయ్యేవి.. కొనుగోలు చేసిన వెంటనే ఆన్‌లైన్ చేస్తే ఈ సమస్య ఉత్పన్నమయ్యేది కాదు. నిర్వాహకులు ఎప్పటికప్పుడు రైతుల జాబితాను, వారి వద్దు ఎంత మొత్తంలో అమ్మకం చేశారో ఆన్‌లైన్ చేస్తే వెంటనే బ్యాంకు ఖాతాలో అధికారులు జమ చేసేవారు. నిర్వాహకుల నిర్లక్ష్యం వల్ల ఆలస్యమవుతుంది.

– గెల్లు చిరంజీవి, యాదవ్‌నగర్, సుల్తానాబాద్

మహిళల ఆరోగ్యమే లక్ష్యం

- 'ఆరోగ్య మహిళ'లో 404 మందికి పరీక్షలు..
- డీఎంహెచ్‌వో సుమన్‌మోహన్‌రావు



నేరెళ్ల ఆరోగ్య కేంద్రంలో మహిళలకు పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

సిరిసిల్ల: మహిళల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా జిల్లాలో 'ఆరోగ్య మహిళ' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని డీఎంహెచ్‌వో డాక్టర్ సుమన్‌మోహన్‌రావు అన్నారు. జిల్లాలోని వేములవాడ, సిరిసిల్ల సుందరయ్యనగర్, నేరెళ్ల, తంగళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మంగళవారం 'ఆరోగ్య మహిళ' వైద్యశిబిరాలు నిర్వహించారు. 404 మంది మహిళలకు పరీక్షలు చేశారు. 55 మందికి థైరాయిడ్ పరీక్షలు చేశామని, 76 మందిలో సూక్ష్మ పోషకాల లోపాలు, 51 మందిలో విటమిన్–డీ లోపాలు, 15 మందిలో వివిధ ఆరోగ్య సమస్యలు గుర్తించి జిల్లాకేంద్ర ఆస్పత్రికి సిఫార్సు చేశామని తెలిపారు. 68 మందికి సీబీపీ, 84 మందికి వివిధ రక్త, మూత్ర పరీక్షలు చేసినట్లు వివరించారు. శిబిరాల్లో పీహెచ్‌సీల డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పాలిసెట్

వేములవాడఅర్బన్: రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రవేటు పాలిటెక్నిక్ కళాశాలలో ఇంజినీరింగ్, నాన్ ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు పాలిసెట్–2023 బుధవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు పాలిటెక్నిక్ జిల్లా కో–ఆర్డినేటర్ బి.రాజగోపాల్ తెలిపారు. విద్యార్థుల కోసం సిరిసిల్ల పట్టణంలో 6 కేంద్రాలు, వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అగ్రహారం ఎస్‌ఆర్‌ఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని, 1,982 మంది పరీక్ష రాయనున్నారని పేర్కొన్నారు. నిమిషం నిబంధన అమలులో ఉంటుందని, కేంద్రాల వద్ద 144 సెక్షన్ కొనసాగుతుందని పేర్కొన్నారు. అభ్యర్థులు ఉదయం 10 గంటలలోపే కేంద్రాలకు చేరుకోవాలని, హాల్ టికెట్, బాల్ పాయింట్ పెన్, హెచ్‌బీ పెన్సిల్, ఎరైజర్ తెచ్చుకోవాలని సూచించారు.

రేషన్ కార్డులేవీ?

- జిల్లాలో 19,750 దరఖాస్తులు పెండింగ్
- ఆహారభద్రతపై పేదల ఎదురుచూపులు
- కొత్త కార్డుల మంజూరుపై ఆశలు



- ఈచిత్రంలో కనిపిస్తున్న దంపతులు తుపాకుల శ్రీనివాస్, అశ్విని. ఊరు ముస్తాబాద్. వీరికి నాలుగేళ్ల క్రితం పెళ్లయ్యింది. రెండేళ్ల కుమారుడు ఉన్నాడు. రేషన్ కార్డు కోసం మూడేళ్లుగా ఎదురు చూస్తున్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుందామంటే వెబ్‌సైట్ మూసివేశారని, సంక్షేమ పథకాలకు కార్డు అడుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.



ముస్తాబాద్‌లో రేషన్ దుకాణం

ముస్తాబాద్(సిరిసిల్ల): రేషన్‌కార్డుల మంజూరుకు పేదలకు ఎదురుచూపులు తప్పడం లేదు. 2018 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి రెండేళ్ల క్రితం రేషన్‌కార్డులు మంజూరు చేశారు. అప్పుడు మూసివేసిన వెబ్‌సైట్ ఇప్పటివరకు తెరవడం లేదు. దీంతో దరఖాస్తుదారుల సంఖ్య వేలల్లోకి చేరుతోంది. పెళ్లైన అమ్మాయిల పేర్లను పుట్టినింట తొలిగిస్తుండగా.. అత్తింట్లో మాత్రం నమోదు చేయడం లేదు. జిల్లాలో నూతనకార్డులు, పేర్లలో మార్పులు, చేర్పులకు దరఖాస్తులు 19,750 పెండింగ్‌లో ఉన్నాయి. కొత్తకార్డుల మంజూరుపై ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన లేకున్నా.. ఎన్నికలు సమీపిస్తున్న వేళ తప్పకుండా ఆదేశాలు వస్తాయన్న ఆశ సర్వత్రా నెలకొంది.

ప్రభుత్వ పథకాలకు..

రేషన్‌కార్డు ఉంటేనే సంక్షేమ పథకాలు వర్తిస్తుండడంతో ఆర్థికంగా ఉన్నవారు.. లేనివారు కూడా కార్డు కోసం ప్రయత్నిస్తున్నారు. విద్య, ఉద్యోగం, వైద్యం విషయంలోనూ రేషన్‌కార్డులే ప్రమాణికంగా తీసుకుంటున్నారు.

వెబ్‌సైట్ మూసివేశారు..

కొత్త కార్డులకు దరఖాస్తు అవకాశం లేదు. వెబ్‌సైట్ క్లోస్ చేశారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలిస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు వాటికి మంజూరు ఇస్తాం. కొత్త కార్డులు, కార్డుల్లో చేర్పులు, సవరణలు త్వరలో చేపడుతాం.

– జితేందర్‌రెడ్డి, డీఎస్‌వో

కొత్తకార్డు ఇవ్వడం లేదు



నేను కూలీ చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాను. తొమ్మిదేళ్ల క్రితం పెళ్లైంది. నాపేరు మా అమ్మ కార్డులో ఉంది. నాపేరు మీద కార్డు లేక డబుల్‌బెడ్‌రూం ఇల్లు రాలేదు. దీపం పథకంలో గ్యాస్ ఇయ్యలేదు. బీసీ కార్పొరేషన్ లోన్ రాలేదు. – ఏదునూరి శ్రీనివాస్, ముస్తాబాద్

కొత్త పేర్లు నమోదు చేయాలి



నాకు పెళ్లయి ఆరేళ్లయ్యింది. నాతోపాటు నా ఇద్దరి పిల్లల పేర్లు కూడా నమోదు చేయలేదు. దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదు. నాలాంటి వారు చాలామంది ఉన్నారు. అందరికీ న్యాయం చేయాలి. – అనమేని లత, ముస్తాబాద్

కలెక్టరేట్ ఎదుట రేషన్ డీలర్ల ధర్నా



కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న జిల్లా రేషన్ డీలర్లు

- గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్
- స్పందించకుంటే జూన్ 5 నుంచి సమ్మె
- అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత

సిరిసిల్ల: ప్రజాపంపిణీ వ్యవస్థలో పనిచేస్తున్న తమకు గౌరవ వేతనం ఇవ్వాలని కోరుతూ రేషన్ డీలర్లు కలెక్టరేట్ ఎదుట మంగళవారం ధర్నాకు దిగారు. తక్కువ కమీషన్‌తో బతుకలేక.. విధులను వదలలేక ఇబ్బంది పడుతున్నామని పేర్కొన్నారు. భద్రత లేక.. అవమానాలు, బాధలు భరిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రెడ్డిమల్ల హన్మాండ్లు మాట్లాడుతూ డీలర్ల జీవితాలు ఎదుగు, బొదుగు లేకుండా ఉన్నాయని, ఎంఎల్‌ఎస్ పాయింట్ నుంచి ప్రతిబస్తాకూ కిలోనుంచి 3 కిలోల తరుగు వస్తుందని, దిగుమతి చార్జీలు చెల్లిస్తున్నామని వివరించారు. రేషన్ డీలర్లకు నెలకు రూ.30వేల గౌరవ వేతనం ఇవ్వాలని కోరారు. అనంతరం అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. సీఎం కేసీఆర్, రాష్ట్ర మంత్రి గంగుల కమలాకర్, పౌర సరఫరాల చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్ స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలన్నారు. లేకుంటే జూన్ 5 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేస్తామన్నారు. ముందుగా రగుడు అంబేద్కర్ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించారు. రేషన్ డీలర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెగ్గలం సత్యనారాయణ, కోశాధికారి కృష్ణమూర్తి, సిరిసిల్ల, వేములవాడ డివిజన్ అధ్యక్షులు పురం రాజేశ్వర్‌రావు, మారం మహేశ్, నాయకులు గాజుల శ్రీనివాస్, నాగభూషణం, ఎస్.రాజయ్య, పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

కౌన్సిలర్ల గోవా టూర్..!

- అసంతృప్తులను బుజ్జగించే ప్రయత్నం?
- వేములవాడలో చర్చనీయంగా ట్రిప్




వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ కౌన్సిలర్లు, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు మంగళవారం గోవా వెళ్లారు. వీరిలో బల్దియాలోని అన్ని పార్టీల కౌన్సిలర్లు, మహిళా కౌన్సిలర్ల భర్తలు ఉండడం స్థానికంగా చర్చనీయాంశమైంది. బీఆర్‌ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కూడా ఈ పర్యటనలో ఉండడం విశేషం. మూడు రోజులపాటు గోవాలో ఉండేలా ఓ స్టార్ హోటల్‌లో బస ఏర్పాటు చేశారు. కౌన్సిలర్ల గోవా ట్రిప్ ఖరీదు రూ.10లక్షల మేర ఉంటుందని భావిస్తున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త ఈ పర్యటనకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలుస్తోంది.

బుజ్జగించే ప్రయత్నం

బల్దియాలో కౌన్సిలర్ల మధ్య కొంత అసంతృప్తి ఉండడంతో వారిని 'కూల్' చేసేందుకు కౌన్సిల్‌లోని అధికార పార్టీ, ప్రతిపక్ష పార్టీ కౌన్సిలర్లను గోవా తీసుకెళ్లినట్లు భావిస్తున్నారు. ఇటీవల జరిగిన మున్సిపల్ పాలకవర్గ సమావేశానికి అధికార పార్టీ కౌన్సిలర్లు కూడా హాజరు కాలేదు. దీంతో మెజార్టీ కౌన్సిలర్లలో అసమ్మతి ఉన్నట్లు గుర్తించి గోవా ట్రిప్‌కు సిద్ధం చేసినట్లు సమాచారం. మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసానికి తెరలేపుతారనే ముందస్తుగా అప్రమత్తమై బుజ్జగింపు ప్రక్రియకు దిగినట్లు తెలుస్తోంది. మరోవైపు ఇప్పటికే చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌కు సఖ్యత లేకపోగా.. స్వతంత్రులుగా గెలిచిన ఓ ఇద్దరు కౌన్సిలర్లు చైర్మన్ ఎన్నికకు సహకరించి దూరంగా ఉంటున్నారు. ముందస్తుగా వీరిని బుజ్జగించేందుకే పర్యాటక ప్రవేశం తీసుకెళ్లినట్లు ఇక్కడి ప్రజలు భావిస్తున్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల గేట్‌ధర్నా



సిరిసిల్ల డిపో ముందు ఉద్యోగుల గేట్‌ధర్నా

సిరిసిల్లటౌన్: హైకోర్టు ఉత్తర్వులు వెంటనే అమలు చేయాలని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈమేరకు మంగళవారం సిరిసిల్ల డిపో ముందు ఉద్యోగులు గేట్‌ధర్నా నిర్వహించారు. ఆర్టీసిలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని, ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా పేస్కేలు అమలు చేయాలని, ఇతర డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. నాయకులు దేవయ్య, గణపతి, నర్సింలు, బాణయ్య, పి.కుమార్ తదితరులు పాల్గొన్నారు.



బద్ది పోచమ్మకు బోనం మొక్కులు

వేములవాడఅర్బన్: బద్ది పోచమ్మకు బోనం మొక్కులు సమర్పించేందుకు భక్తులు బారులు తీరారు. మహిళలు నెత్తిన బోనాలు, డప్పు చప్పుళ్ల మధ్య ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు.



క్లుప్తంగా

‘జిజ్ఞాస’లో రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతి



బహుమతి అందుకుంటున్న విద్యార్థులు

వేములవాడఅర్బన్: వేములవాడ మండలంలోని అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామర్స్ విద్యార్థులు కళాశాల విద్యాశాఖ ఏర్పాటు చేసిన జిజ్ఞాస స్టడీ ప్రాజెక్టు రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రథమ బహుమతి సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ఎన్టీఆర్ సమావేశ మందిరంలో కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇందులో విద్యార్థులు సుష్మ, లహరిక, రాజేశ్, యశ్వంత్, అనిరుధ్‌లు తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి చేతులమీదుగా బహుమతి అందుకున్నారు. ప్రిన్సిపాల్ వడ్లూరి శ్రీనివాస్, కామర్స్ అధ్యాపకులు ఎం.మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బెస్ట్ అవేలబుల్ స్కూల్స్‌లో ప్రవేశాలు

సిరిసిల్లకల్చరల్: 2023–24 విద్యాసంవత్సరానికి గాను బెస్ట్ అవేలబుల్ స్కూళ్లలో గిరిజన విద్యార్థులకు 20 సీట్లు కేటాయించినట్లు జిల్లా గిరిజన అభివృద్ధి, సంక్షేమశాఖ అధికారి గంగారాం ఒక ప్రకటనలో తెలిపారు. మూడో తరగతిలో లంబాడా బాలికలకు 3, బాలురకు 5, ఎరుకల బాలబాలికలకు ఒక్కో సీటు, 5వ తరగతిలో ఒక్కో సీటు, 8వ తరగతిలో లంబాడా బాలురకు 3, బాలికలకు 1, ఎరుకల బాలురకు 1 సీట్లు, మిగతావి ఇతర సామాజిక వర్గాలకు ఉన్నాయన్నారు. తల్లిదండ్రుల వార్షికాదాయం పట్టణవాసులకు రూ.2 లక్షలు, గ్రామీణులకు రూ.1.5 లక్షలకు మించనివారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తుకు ఆధార్‌కార్డు, స్టడీ సర్టిఫికెట్లు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు జత చేసి, జూన్ 2న సాయంత్రం 5 గంటల్లోగా కరీంనగర్‌లోని గిరిజన సంక్షేమ శాఖ అధికారి కార్యాలయంలో అందజేయాలన్నారు. 7న లాటరీ పద్ధతిలో విద్యార్థులకు సీట్ల కేటాయిస్తామని తెలిపారు. ఇతర వివరాలకు 96521 18867 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

19 మంది వాహనదారులకు జరిమానా

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రోడ్డు భద్రతా నియమాలను ఉల్లంఘించిన 19 మంది వాహనదారులకు పోలీసులు మంగళవారం జరిమానా విధించారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు రాగట్లపల్లి వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. మద్యం తాగి వాహనాలు నడపడంతోపాటు సరైన ధ్రువపత్రాలు, హెల్మెట్ లేకుండా రోడ్డుపైకి రావడం, నంబర్ ప్లేట్ లేని వాహనాలను వినియోగించడంతో జరిమానా విధించినట్లు ఎస్సై శేఖర్ తెలిపారు. ప్రతీ వాహనదారుడు కచ్చితంగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు. హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరమని, మైనర్లకు వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

డీజే యజమానుల బైండోవర్

కోనరావుపేట(వేములవాడ): గ్రామాల్లో వివాహాది శుభకార్యాలకు డీజే సౌండ్ పెట్టవద్దని హెచ్చరించినా పెడుతున్న పలువురు డీజే యజమానులను మంగళవారం తహసీల్దార్ రవికాంత్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు. మైలారం వెంకటేశం, వెలిశాల రవి(ధర్మారం), నేదునూరి మల్లేశం (నిమ్మపల్లి), వంగపెల్లి వంశీ(నిజామాబాద్), ఎనగంటి మహేశ్, జిన్న రమేశ్(పల్లిమక్త), కుడుకల మహిపాల్(సుద్దాల), పిట్టల వంశీ, మారుపాక చంద్రయ్య (కనగర్తి), కీసరి రాజు(నాగారం), చింతల పర్శరాం(కోనరావుపేట)లను బైండోవర్ చేశామన్నారు. ఇకమీదట డీజేలు పెడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

లెక్కలపై లుక్కేయాల్సిందే..!

- పదోతరగతిలో గణితంలో ఫెయిలైనవారే ఎక్కువ
- జిల్లాలో 234 మంది
- ఆంగ్లంలో వెనుకబాటు
- సప్లిమెంటరీకి ఫీజు చెల్లింపునకు 26 వరకు గడువు



పరీక్ష రాస్తున్న విద్యార్థులు (ఫైల్)

జిల్లాలో విద్యార్థుల సమాచారం

సబ్జెక్టు	ఫెయిలైనవారు
తెలుగు	73
హిందీ	8
ఇంగ్లిష్	111
గణితం	234
సైన్స్	71
సోషల్	70

సిరిసిల్ల ఎడ్యుకేషన్: విద్యార్థులకు మీకే సబ్జెక్టు కష్టం అనగానే ఆలోచన చేయకుండా ఇచ్చే సమాధానం గణితం. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన పదో తరగతి ఫలితాల్లోనూ గణితంలోనే విద్యార్థులు ఎక్కువ మంది ఫెయిల్ అయ్యారు. అలాగే అన్ని సబ్జెక్టులు ఆంగ్లంలో అభ్యసించిన విద్యార్థుల్లో పలువురు ఇంగ్లిష్ పరీక్షలో తప్పడం గమనార్హం. అందుకే తరగతి ఏదైనా లెక్కలపై లుక్కేయాల్సిందేనని సీనియర్ ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నారు. మేము చదువుతున్నది ఇంగ్లిష్ మీడియం కదా ఆంగ్ల పరీక్ష రాయడం చాలా సులభతరం అనే భావనలో ఆ సబ్జెక్టును చులకనగా చూడటం వల్ల వెనుకబడినట్లు భావిస్తున్నారు.

మారిన పరీక్ష విధానమే ఆటంకి..

పదోతరగతి పరీక్షలు గతంలో ఒక్కో సబ్జెక్టు పేపర్–1, పేపర్–2గా ప్రతీ పరీక్ష థియరీకి 40 మార్కుల చొప్పున ఉండేది. కానీ ఈ సంవత్సరం నిర్వహించిన పరీక్ష విధానంలో ఒక సబ్జెక్టు ఒక పేపర్ మాత్రమే ఉంది. నిర్ణీత కాల వ్యవధిలో 80 మార్కులకు పరీక్ష రాస్తే ఎలా రాశామోనని చూసుకొని, సరిచేసుకునే అవకాశం లేకుండా పోయింది. అదే గత విధానాల్లో విద్యార్థులు పేపర్–1 సరిగా రాయని పక్షంలో తదుపరి రోజు ఉండే పేపర్–2ను కాస్త శ్రద్ధగా రాసి, పాస్ మార్కులు తెచ్చుకునేవాళ్లని ఉపాధ్యాయులు విశ్లేషిస్తున్నారు.

అన్ని పరీక్షలు వేరు.. గణితం వేరు

ప్రస్తుతం ఉన్న అభ్యసన విధానం, సీసీఈ మెథడ్‌లో ఫిజికల్ సైన్స్, గణితంలో విద్యార్థి తన వ్యక్తిగత, సామాజిక ఇతివృత్తాన్ని రాయడానికి వీలుండదు. ఇక మిగిలిన తెలుగు, హిందీ, ఇంగ్లిష్, సోషల్ సబ్జెక్టులలో తనకున్న పరిజ్ఞానంతో ప్రశ్నలకు సమాధానం రాసేందుకు వీలుంది. విషయాన్ని ఒకే నిడివితో విద్యార్థులందరూ ఒకే విధానంలో రాయాల్సిన అవసరం కూడా లేదు. అదే గణితానికి వస్తే విద్యార్థి జవాబును ఖచ్చితత్వంతో పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈ కారణంగా పిల్లలు గణితంలో వెనుకబడి, ఉత్తీర్ణులు కాలేకపోయారని ఓ సీనియర్ ఉపాధ్యాయుడు వెల్లడించారు.

కష్టమనే భావన వద్దు..



విద్యార్థులు గణితం మాకు కష్టమనే భావన నుంచి బయటకు రావాలి. ఖచ్చితత్వంతో లెక్కలు చేశాక సమాధానం రాబట్టగలిగితే దానిలో ఉన్న ఆసక్తి మరింత పెరుగుతుంది. విద్యార్థులు పాఠ్యపుస్తకంలో సమాచారాన్ని మరింత సాధారణీకరించి ప్రశ్నలు వేసుకొని, ప్రాక్టీస్ చేయాలి. అప్పుడు పరీక్షలో ఎలాంటి ప్రశ్నలు వచ్చినా సమాధానం రాబడుతారు. లెక్కలు రావాలంటే ప్రాక్టీస్ చేయాల్సిందే. సప్లిమెంటరీ పరీక్షలకు ఫీజు చెల్లింపునకు గడువు ఈ నెల 26 వరకు ఉంది.

– దాసరి రాధారాణి, సీనియర్ గణిత ఉపాధ్యాయురాలు, సిరిసిల్ల

‘కంటి వెలుగు’ సద్వినియోగం చేసుకోండి

- జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ



శిబిరాన్ని ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ అరుణ

కోనరావుపేట(వేములవాడ): కంటి వెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ అన్నారు. కోనరావుపేట మండలంలోని రామన్నపేటలో మంగళవారం కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. అంధరహిత సమాజ నిర్మాణ కోసం సీఎం కేసీఆర్ ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని తెలిపారు. కంటి పరీక్షలు చేసి, అవసరమైనవారికి కళ్లద్దాలు ఇవ్వడంతోపాటు ఉచితంగానే ఆపరేషన్లు చేయిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కాదాస్ సంతోష్, ఎంపీటీసీ సభ్యుడు మల్లేశ్, సింగిల్‌విండో డైరెక్టర్ గరుగుల నాగిరెడ్డి, వార్డు సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థినికి గ్రామస్తుల సన్మానం



వినీలను సత్కరిస్తున్న గ్రామస్తులు

గంభీరావుపేట(సిరిసిల్ల): మండలంలోని దమ్మన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న పొన్నాల వినీల ఉమెన్స్ ఫ్రెండ్లీ యూటెన్సిల్స్ సపోర్టర్‌కు రూపకల్పన చేసింది. దీన్ని కేరళలో నిర్వహించిన సౌత్ ఇండియా ఇన్నోవేషన్ ఫెయిర్–2023లో ప్రదర్శించి, మూడో బహుమతి గెలుచుకుంది. ఐఐటీ హైదరాబాద్‌వారు నిర్వహించిన ఫ్యూచర్ ఇన్నోవేటర్స్ ఫెయిర్–2023లో వైజ్ఞానిక ప్రదర్శనలో రాణించి, భారత్ బయోటెక్ చైర్మన్ కృష్ణ ఎల్లా చేతులమీదుగా ప్రశంసాపత్రం, మెమెంటో అందుకుంది. పాఠశాలకు, గ్రామానికి, జిల్లాకు పేరు తీసుకువచ్చిన వినీలను, ఆమెకు సహకరించిన గైడ్ టీచర్ సంపత్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు బోయన్నగారి నారాయణలను దమ్మన్నపేట గ్రామస్తులు మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సెక్రటరీ సుష్మ, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

‘గాంధీ విగ్రహాన్ని కూల్చేస్తామనడం విచారకరం’



ఏఎస్సైకి ఫిర్యాదు చేస్తున ధర్మేందర్

ముస్తాబాద్(సిరిసిల్ల): జాతిపిత మహాత్మగాంధీ విగ్రహాన్ని కూల్చేస్తామన్న బీఆర్ఎస్ నాయకుడిపై చర్య తీసుకోవాలని బీఎంఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ధర్మేందర్ కోరారు. ఈ మేరకు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోతుగల్ గ్రామంలో జరిగిన గ్రామసభలో వివిధ పార్టీల జెండాల గద్దెలు ఇబ్బందికరంగా ఉన్నాయని ఫిర్యాదు చేస్తే.. గ్రామం నడిబొడ్డున ఉన్న గాంధీ విగ్రహాన్ని కూడా కూల్చివేస్తామని బీఆర్ఎస్ నాయకుడు మాట్లాడటం విచారకరమన్నారు. సర్పంచ్, పంచాయతీ కార్యదర్శుల ఎదుటే గాంధీని అవమానించిన ఆయనపై చర్య తీసుకోవాలని విన్నవించారు.

రుద్రంగిలో ఆర్టీసీ బస్సు, వ్యాన్ ఢీ

- రెండు వాహనాలూ ధ్వంసం
- మండల కేంద్రంలో ఇరుకు రోడ్డుతో ప్రయాణికుల ఇబ్బందులు



ఢీకొన్న ఆర్టీసీ బస్సు, వ్యాన్

రుద్రంగి(వేములవాడ): మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి ఇందిరా చౌక్ వరకు రోడ్డు ఇరుకుగా ఉండటంతోపాటు ధ్వంసమైంది. దీంతో ప్రయాణికులు నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆర్టీసీ బస్సు, లోడ్‌తో వెళ్తున్న వ్యాన్ ఒకదానికొకటి ఢీకొని, ధ్వంసమయ్యాయి. ఈ రోడ్డుపై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి, బాగు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

- స్కూటీని వ్యాన్ ఢీకొట్టడంతో ఘటన
- బాధితుడి పరిస్థితి విషమం



గాయపడిన లక్ష్మణ్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండల కేంద్రం శివారులో సిరిసిల్ల–కామారెడ్డి ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన మీసం లక్ష్మణ్ మంగళవారం స్కూటీపై రాగట్లపల్లి వైపు వెళ్తున్నాడు. అదే సమయంలో సిరిసిల్ల నుంచి ఎల్లారెడ్డిపేట వైపు వేగంగా వస్తున్న డీసీఎం వ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లక్ష్మణ్ దూరంగా ఎగిరి పడటంతో తలకు బలమైన గాయాలయ్యాయి. బాధితుడిని స్థానికులు 108 వాహనంలో స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రథమ చికిత్స అనంతరం సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. లక్ష్మణ్‌ను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షుడు బండారి బాల్‌రెడ్డి పరామర్శించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శేఖర్ తెలిపారు.

దైవ దర్శనానికి వెళ్లొస్తూ.. అనంతలోకాలకు

- డివైడర్‌ని ఢీకొన్న వాహనం
- డ్రైవర్ మృతి, పలువురికి స్వల్ప గాయాలు
- బాధితులు హైదరాబాద్‌వాసులు



సిరిసిల్ల అర్బన్: ఓ వాహనం అదుపుతప్పి, డివైడర్‌ని ఢీకొన్న ఘటనలో డ్రైవర్ మృతిచెందగా పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. వరంగల్‌కు చెందిన పైండ్ల రాజు(48) హైదరాబాద్‌లో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అతను హైదరాబాద్‌కే చెందిన ఓ కుటుంబాన్ని సోమవారం తుఫాన్ వాహనంలో వేములవాడ, కొండగట్టు, ధర్మపురి క్షేత్రాలకు తీసుకెళ్లాడు. స్వామివార్ల దర్శనం అనంతరం మంగళవారం తిరుగుపయనమయ్యారు. తంగళ్లపల్లి మండల కేంద్రంలోని బొమ్మల మూలమలుపు వద్ద వాహనం అదుపు తప్పి, డివైడర్‌ని ఢీకొట్టి, చాలా దూరం దాన్ని తాకుతూ వెళ్లింది. ఈ ఘటనలో డ్రైవర్ వాహనంలోనే ఇరుక్కుపోయాడు. స్థానికులు 108కి సమాచారం అందించారు. అంబులెన్స్ వచ్చి, సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించేలోపే రాజు మృతి చెందినట్లు ఎస్సై లక్ష్మారెడ్డి తెలిపారు. వాహనంలో ఉన్న మొత్తం 10 మందిలో పలువురికి స్వల్ప గాయాలయ్యాయని చెప్పారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పవర్‌లూం కార్మికుని బలవన్మరణం

- ఐదుసార్లు పవర్‌లూమ్స్ అద్దెకు తీసుకొని నడిపినా నష్టాలే
- మనస్తాపంతో ఆత్మహత్య



ఆంజనేయులు (ఫైల్)

సిరిసిల్లక్రైం: కులవృత్తిని నమ్ముకున్నాడు.. వరుస నష్టాలు వస్తున్నా అదే పనిలో రాణించాలని తపన పడ్డాడు.. ఏం చేసినా నష్టాలే రావడంతో చివరికి తనువు చాలించాడు పవర్‌లూం కార్మికుడు ఎనుగంటి ఆంజనేయులు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణంలోని బీవైనగర్‌కు చెందిన ఆంజనేయులు(43) ఐదుసార్లు పవర్‌లూమ్స్‌ను అద్దెకు తీసుకొని, పని చేయగా నష్టం వచ్చింది. ఇటీవల ప్రభుత్వం ఇస్తున్న వస్త్రోత్పత్తి ఆర్డర్లతో కాస్త లాభాలు వస్తాయని ఆశించి, కొన్ని నెలల క్రితం ఐదు జోడీలను అద్దెకు తీసుకొని, నడిపిస్తున్నాడు. వీటితోనూ నష్టమే రావడంతో మనస్తాపం చెందాడు. మంగళవారం పవర్‌లూంకు సంబంధించిన సామగ్రి షెడ్డులో తాడుతో ఉరేసుకున్నాడు. మృతుని భార్య శ్రీలత అపెరల్ పార్కులో పని చేస్తోంది. ఈ దంపతులకు ఇద్దరు కుమారులున్నారు. పోలీసులు ఆంజనేయులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుప్రతికి తరలించారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్
- వేములవాడలో వాహన డ్రైవర్లకు కంటి పరీక్షలు



కంటి వైద్య శిబిరంలో ఎస్పీ అఖిల్ మహాజన్

వేములవాడఅర్బన్: వాహనాల డ్రైవర్లు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. వేములవాడ పట్టణంలోని మహాలింగేశ్వర గార్డెన్‌లో పోలీసు శాఖ ఆధ్వర్యంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించి, మాట్లాడారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించాలన్న ఉద్దేశంతో తమ వంతు బాధ్యతగా కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని తెలిపారు. వాహన డ్రైవర్లకు కంటి చూపు అతి ముఖ్యమన్నారు. కంటి పరీక్షలు చేయించి, అవసరమైన వారికి ఉచితంగా అద్దాలు అందిస్తామని పేర్కొన్నారు. డ్రైవర్లు ట్రాఫిక్ నియంత్రణలోనూ భాగస్వాములు కావాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే సీజ్ చేస్తామని హెచ్చరించారు. ప్రతీ ఆటోకు క్యూఆర్ కోడ్ స్కానర్ కూడా పెడతామని తెలిపారు. ఆటోలో పరిమితి వరకే ప్రయాణికులను తీసుకువెళ్లాలని చెప్పారు. సుమారు 400 మందికి వైద్యులు కంటి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి అద్దాలు అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీ నాగేంద్రచారి, సీఐలు వెంకటేశ్, బన్సీలాల్, కిరణ్ కుమార్, వేములవాడ డివిజన్ ఆటో యూనియన్ అధ్యక్షుడు దేవరాజు, లారీ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్, డీసీఎం వ్యాన్ అసోసియేషన్ అధ్యక్షుడు హన్మయ్య, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం

సిరిసిల్లటౌన్: రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తోందని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. మంగళవారం సిరిసిల్లలోని కల్యాణలక్ష్మి ఫంక్షన్‌హాలులో ప్రైవేటు ప్యాసింజర్స్ వాహనాల డ్రైవర్లకు కంటివెలుగు కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. డ్రైవర్ల కంటి చూపు బాగుంటే ప్రమాదాలు జరగకుండా ఉంటాయన్నారు. అతివేగం, ఓవర్‌లోడ్ ప్రయాణాలపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్సై స్థాయి అధికారిని నియమించి, గ్రామాల్లో రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తామన్నారు. అనంతరం ప్రైవేటు డ్రైవర్లకు ఉచితంగా కంటిపరీక్షలు నిర్వహించి, అవసరం ఉన్నవారికి అద్దాలు అందించారు. డీఎంహెచ్‌వో సుమన్ మోహన్‌రావు, అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ విశ్వప్రసాద్, సీఐలు అనిల్‌కుమార్, మొగిలి తదితరులున్నారు.

బుద్ధ విజ్ఞాన కేంద్రం సిద్ధం

- మోహినికుంటలో ఆధునిక హంగులతో గ్రంథాలయ భవన నిర్మాణం
- అందుబాటులో రూ.20 లక్షల విలువైన పుస్తకాలు
- త్వరలో మంత్రి కేటీఆర్ చేతులమీదుగా ప్రారంభం



బుద్ధ విజ్ఞాన కేంద్ర భవనం

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని ఆదర్శ గ్రామం మోహినికుంటలో ఆధునిక హంగులతో బుద్ధ విజ్ఞాన కేంద్రం నిర్మితమైంది. ఇందులో గ్రౌండ్, ఫస్ట్ ఫ్లోర్‌లలో సందర్శకుల విడిది కోసం ఏర్పాట్లు చేశారు. మోహినికుంటతోపాటు మద్దికుంట, మొర్రాయిపల్లె, రాజక్కపేట, బందనకల్, వెంకట్రావుపల్లె తదితర గ్రామాల నిరుద్యోగులు, ప్రజలకు ఉపయోగపడేలా రూ.26 లక్షలతో ఈ గ్రంథాలయం నిర్మించారు. రూ.20 లక్షల విలువైన పుస్తకాలను అందుబాటులో ఉంచారు. ఒక లైబ్రేరియన్‌ను గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నియమించారు. విద్య, వినోదం, వికాసం, చరిత్ర, సైన్స్, మత గ్రంథాలు, ఆధునిక ప్రపంచ, దేశ, తెలంగాణ చరిత్ర, రాజ్యాంగం, ఇండియన్ పీనల్ కోడ్ పుస్తకాలు ఉన్నాయి. వీటితోపాటు ఆధునిక సమాచారం అందరికీ అందుబాటులో ఉండేలా 15 కంప్యూటర్లకు, ప్రింట్ తీసుకునేలా ప్రింటర్లకు ఆర్డర్ ఇచ్చారు. 15 రోజుల్లో బుద్ధ విజ్ఞాన కేంద్రంలో వాటిని ఏర్పాటు చేయిస్తామని సర్పంచ్ కల్వకుంట్ల వనజ, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు కల్వకుంట్ల గోపాల్‌రావు తెలిపారు. రాష్ట్ర ఐటీశాఖ మంత్రి కేటీఆర్ చేతులమీదుగా త్వరలోనే ఈ గ్రంథాలయాన్ని ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

ఐదేళ్ల క్రితమే గ్రంథాలయం ఏర్పాటు



నేను సర్పంచ్‌గా గెలిచాక అద్దె భవనంలో గ్రంథాలయం ఏర్పాటు చేశా. చాలా మంది విద్యార్థులు, యువత చదువుకునేందుకు వచ్చేవారు. విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్, యోగాపై శిక్షణ ఇప్పించాం. మంచి ఫలితాలు వచ్చాయి. అందుకే మంత్రి కేటీఆర్ సహకారంతో బుద్ధ విజ్ఞాన కేంద్రం నిర్మించాం. ఇది మరింత మందికి ఉపయోగపడుతుంది.

– కల్వకుంట్ల వనజ, సర్పంచ్, మోహినికుంట

మంత్రి కేటీఆర్‌కు చెప్పగానే ఓకే అన్నారు



మోహినికుంటలో అన్ని హంగులతో గ్రంథాలయం నిర్మించాలనుకున్న విషయాన్ని మంత్రి కేటీఆర్‌కు చెప్పగానే ఓకే అన్నారు. బుద్ధ విజ్ఞాన కేంద్రం చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు చైతన్య కరదీపిక అవుతుంది. రూ.లక్షల విలువైన వేలాది పుస్తకాలను ఇక్కడ అందుబాటులో ఉంచాం. కంప్యూటర్లు కూడా ఏర్పాటు చేయిస్తున్నాం.

– కల్వకుంట్ల గోపాల్‌రావు, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు

తల్లిని చంపిన తనయుడికి జీవితఖైదు

సిరిసిల్లటౌన్: తల్లిని చంపిన ఓ తనయుడికి జీవితఖైదు విధిస్తూ రాజన్న సిరిసిల్ల జిల్లా జడ్జి ప్రేమలత తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. ఇల్లంతకుంట మండలంలోని అంతగిరి గ్రామానికి చెందిన యరి ఎల్లవ్వ పేరిట బ్యాంకులో రూ.44 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఉన్నాయి. నామినిగా కుమారుడు యరి రాజయ్యగా పేర్కొంటూ.. బ్యాంకులో నగదు దాచుకుంది. తల్లిని చంపితే మొత్తం డబ్బులు వెంటనే తనకు వస్తాయన్న దురాశతో అతను పథకం వేశాడు. 24 జూన్ 2021న రాత్రి తల్లిపై కర్రతో దాడి చేసి, హతమార్చాడు. మృతురాలి మరో కుమారుడు ముత్తయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సిరిసిల్ల రూరల్ సీఐ ఉపేందర్ ఆధ్వర్యంలో 10 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూటర్ పవన్‌కుమార్ వాదనలు వినిపించి, రాజయ్య నేరం చేసినట్లు రుజువు చేశారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన జడ్జి అతనికి జీవితఖైదుతోపాటు రూ. 5 వేల జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు వెల్లడించారు. నేరస్తుడికి శిక్ష పడేందుకు కృషి చేసిన సీఐ ఉపేందర్, కోర్టు కానిస్టేబుళ్లు మహేందర్, నవీన్, సీఎంఎస్ ఎస్సై శ్రీనివాస్, కానిస్టేబుల్ నరేందర్‌లను ఎస్పీ అఖిల్ మహాజన్ అభినందించారు.



వరి.. మేతగా మారి



వేములవాడరూరల్: మండలంలోని వట్టెంల గ్రామానికి చెందిన విష్ణుకిరణ్‌రెడ్డి నాలుగెకరాల్లో వరి, నాలుగెకరాల్లో మామిడితోట సాగు చేశాడు. ఇందుకోసం దాదాపు రూ.2.50 లక్షల వరకు పెట్టుబడి పెట్టాడు. ఇటీవల కురిసిన వర్షాలతో వరి పంట పూర్తిగా దెబ్బతిని, గింజలు నేలరాలాయి. మామిడికాయలు కూడా రాలిపోయి, రంగు మారాయి. దీంతో ఆయన పెట్టిన పెట్టుబడి రాకపోగా వడ్లు రాలిన పొలంలో పశువులను మేపుతున్నాడు. ఇది ఈ ఒక్క రైతు పరిస్థితే కాదు వేములవాడ రూరల్ మండలంలోని చాలా మందిది. ప్రభుత్వం స్పందించి, తమకు పరిహారం చెల్లించాలని వారు కోరుతున్నారు.